


## భూత్పూర్‌లో నేరాలకు చెక్ పెట్టాలి

- నేర నియంత్రణే లక్ష్యంగా పటిష్ట నిఘా
- పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి:

జిల్లా ఎస్పీ డి.జానకి

15లో

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
26 బుధవారం, ఆగస్టు 2026 పేజీలు:16



# ఆర్అండ్ఆర్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి:

## అదనపు కలెక్టర్ మధుమోహన్

- ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి






**గద్వాల ఆగస్టు 25(ప్రజా జ్యోతి ప్రతినిధి):** జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని,ఆర్అండ్ఆర్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ అధికారులను ఆదేశించారు.సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి సంబంధించి భూసేకరణ,ఆర్అండ్ఆర్,అటవీ సమస్యలపై మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.గద్వాల ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ మధుమోహన్ సంబంధిత అధికారులతో కలిసి ఈ సమీక్షలో పాల్గొన్నారు. మిగతా 2 లో

మొదటిపేజీ తరువాయి

# ఆర్అండ్ఆర్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి:అదనపు కలెక్టర్ మధుమోహన్

## - ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధులు ఇప్పటికే విడుదల చేసినందున పనులను పెండింగ్‌లో ఉంచకుండా వేగవంతం చేయాలని సూచించారు.ప్రాజెక్టుల వారీగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు నిర్దేశిత సమయంలోగా పరిహారం చెల్లించాలని ఆదేశించారు.అవసరమైన ప్రక్రియలు పూర్తయి,నిధులు అందుబాటులో ఉన్న చోట వెంటనే పరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు.సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి ఆటంకంగా ఉన్న అటవీ సమస్యలు,పెండింగ్ చెల్లింపులు,క్లియరెన్సులు,ఇతర అంశాలను గుర్తించి వాటి వివరాలను నీటిపారుదల శాఖకు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.భూసేకరణ,పరిహారం చెల్లింపులు,ఆర్అండ్ఆర్,అటవీసమస్యలు,ఆర్థిక అనుమతులు,టోకెన్లు తదితర ఆర్థిక,ప్రక్రియాపరమైన కారణాలతో ఏ ప్రాజెక్టు ఆలస్యమైనా సంబంధిత కలెక్టర్,చీఫ్ ఇంజినీర్ సమస్యను స్పష్టంగా గుర్తించి వెంటనే ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు.సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని మంత్రి పేర్కొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్ మధుమోహన్ జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు.ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, ఆర్అండ్ఆర్ సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించి పనుల పురోగతికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని ఆదేశించారు.సమావేశంలో భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కృష్ణ,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్‌కుమార్‌రెడ్డి,రాజ్‌కుమార్,జీ సెక్షన్ పర్యవేక్షకుడు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవంలో మొక్కలు నాటిన అధికారులు

## - విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపు

మహబూబ్‌నగర్, ఆగస్టు 25 ( ప్రజా జ్యోతి బ్యూరో ):

వన మహోత్సవంలో భాగంగా జడ్చర్ల మినీ గురుకులంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో విజయ్, ఏపీవో విజయ్ భాస్కర్, సర్పంచ్ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి రాజేష్ పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను కేవలం నాటడంతోనే బాధ్యత ముగియదని, వాటిని క్రమం తప్పకుండా సంరక్షించి భవిష్యత్తులో పెద్ద వృక్షాలుగా ఎదిగేలా చూడాలని సూచించారు. మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యత కాపాడటంతో పాటు స్వచ్ఛమైన గాలి, పచ్చదనం పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకుని, మొక్కల సంరక్షణలో చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పచ్చదనంతో నింపేందుకు విద్యార్థులు, సిబ్బంది కలిసి కృషి చేయాలని అధికారులు కోరారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మినీ గురుకులం సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# కేజీబీవీలో డీఈఓ ఆకస్మిక తనిఖీ..

## నాణ్యమైన భోజనం, విద్య అందించాలి

మహబూబ్‌నగర్ రూరల్, ఆగస్టు 25 ( ప్రజా జ్యోతి బ్యూరో ):

మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూరులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన సదుపాయాలు, విద్యా బోధన తదితర అంశాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, స్నాక్స్ అందించాలని అధికారులను ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనం, స్నాక్స్ అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులను నేరుగా కలిసి వసతి, భోజనం, ఇతర సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల పరిసరాలు, వంటగది, వాష్‌రూమ్‌లు, తరగతి గదులను పరిశీలించారు. స్టోర్‌రూమ్‌లోని వంట సామగ్రి, వంటకు వినియోగించే సరుకులు, వాటి నాణ్యత, గడువు తేదీలను పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంతో పాటు అన్ని వసతి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా డీఈఓ విజయకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం కేజీబీవీలలో విద్యార్థులకు మెరుగైన వసతులతో పాటు నాణ్యమైన భోజనం, అనుభవజ్ఞులైన అర్హత కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడంతో పాటు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.నీట్‌పై ప్రత్యేక దృష్టి:కేజీబీవీలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు నీట్ కోచింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ సందేహాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకుని, కష్టపడి చదివి నీట్ పరీక్షలో మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు. భవిష్యత్తులో వైద్య వృత్తిని చేపట్టి సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించారు.



# ఊరంతా మొక్కలు- ఇంటింటా పచ్చదనం

మహమ్మదాబాద్ ఆగస్టు 25(ప్రజాజ్యోతి )



మండలం లోని నంచర్ల గ్రామం లో మంగళ వారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు వేదిక, మరియు బాలికల రెసిడెన్సియల్ వసతి గృహం లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ సుంకిరెడ్డి గాయత్రి దేవి,ఉప సర్పంచ్ సుమిత్రా లక్ష్మణ్, ఝాశీ గోవింద్ నాయక్, ఏ ఈ ఓ నరేందర్, ఎం ఏ ఓ దీప్తి, పంచాయతి కార్య దర్శి శ్యాం సుందర్, వార్డ్ సభ్యులు చిన్నారెడ్డి తో పాటు మాజీ గ్రంథాలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ కేశవులు, టెక్నీకల్ అసిస్టెంట్ రాజేందర్ గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

# మన ఊరు పచ్చగా....... మన భవిష్యత్ చల్లగా...

## రుసుంపల్లి గ్రామం లో ఘనంగా వన మహోత్సవం

గండీడ్ ఆగస్టు 25(ప్రజా జ్యోతి )



గండీడ్ మండలం లోని రుసుంపల్లి గ్రామం లో మంగళ వారం వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తో పాటు ప్రజా ప్రతినిధులు మరియు గ్రామ పెద్దలు పలు చోట్ల మొక్కలు నాటారు ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ కార్య దర్శి తో పాటు ఫీల్డ్ అసిస్టెంట్, వార్డ్ మెంబర్లు గ్రామ యువకులు పాల్గొన్నారు

# జర్నలిజం రంగానికి సురవరం సేవలు చిరస్మరణీయం

## - సురవరం ప్రతాప్‌రెడ్డి విగ్రహానికి జర్నలిస్టుల ఘన నివాళి

**వనపర్తి, ఆగస్టు 25 (ప్రజాజ్యోతి):**

తెలంగాణ వైతాళికుడు, వనపర్తి తొలి ఎమ్మెల్యే సురవరం ప్రతాప్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని జర్నలిస్టులు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం పట్టణంలోని సురవరం ప్రతాప్‌రెడ్డి పార్కులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. తెలంగాణ సమాజంలో చైతన్యం తీసుకురావడంలో సురవరం ప్రతాప్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. సాహితీవేత్తగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, జర్నలిస్టుగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. 'గోల్కొండ' పత్రికను స్థాపించి తెలంగాణలో జర్నలిజానికి విశిష్ట సేవలందించారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను నేటి తరం జర్నలిస్టులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బక్షి శ్రీధర్‌రావు, జి. శ్రీనివాస్‌యాదవ్, జానీ, గంధం దినేష్, మహమ్మద్ ఖలీల్, శ్రీనాథ్, బండార్ గోపాల్, శ్యామ్, తరుణ్, మల్లికార్జున్, ప్రముఖ క్రీడాకారుడు బొలెముని నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రచారంలో సోషల్ మీడియా కీలకం: ఆదిత్యరెడ్డి

## - టీపీసీసీ సోషల్ మీడియా చైర్మన్‌గా నవీన్‌కు అభినందనలు

## - సోషల్ మీడియాతో కాంగ్రెస్ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**వనపర్తి, ఆగస్టు 25 (ప్రజాజ్యోతి):**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) సోషల్ మీడియా నూతన చైర్మన్ పెట్టం నవీన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఏఐపీసీ అధ్యక్షుడు, వనపర్తి నియోజకవర్గ యువ నాయకుడు డాక్టర్ జిల్లెల ఆదిత్యరెడ్డి హాజరై నవీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ జిల్లెల ఆదిత్యరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. యువతను కాంగ్రెస్ పార్టీతో మరింతగా అనుసంధానం చేయడంలో నవీన్ నాయకత్వం దోహదపడాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంచడంలో సోషల్ మీడియా ముఖ్యమైన సాధనమని తెలిపారు. నవీన్ తనకు అప్పగించిన కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి మంచి ఫలితాలు సాధిస్తారనే నమ్మకం ఉందన్నారు. ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టాలని డాక్టర్ ఆదిత్యరెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్న యాదవ్‌తో పాటు రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, వివిధ జిల్లాలకు చెందిన సోషల్ మీడియా విభాగం నాయకులు పాల్గొన్నారు.



# ప్రత్యేక లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి - సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)**



21 నవంబర్ 2026 నా నెగో షియబుల్ ఇన్స్టుమెంట్స్ యాక్ట్ కేసులకు శాశ్వత పరిష్కారం ద్వారా ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే ఈ కార్య క్రమాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని లీగల్ సర్వీసెస్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు ఆదేశాలనుసారం లీగల్ సర్వీసెస్ సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు బ్యాంకు అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవల అధికార సంస్థ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అధికార సంస్థ ఆదేశాల మేరకు, ప్రత్యేక లోక్ అదాలత్ నెగోషియబుల్ ఇన్స్టుమెంట్స్ యాక్ట్, 1881లోని సెక్షన్ 138 కింద కేసుల పరిస్కారం కోసం ప్రత్యేకంగా ఒక లోక్ అదాలత్ ని నిర్వహిస్తోంది అన్నారు. 21 నవంబర్ 2026 3వ శనివారం నాడు ఈ కార్యక్రమాని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ను విజయవంతం చేయడానికి , కక్షిదారులకు లోక్ అదాలత్ వలన కలిగే మేలును మీ వంతుగా, మీ శైలిలో తెలపాలని ఈ సందర్భంగా లీగల్ సర్వీసెస్ సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ కోరారు. రాజీ పడదగు కేసులలోని కక్షిదారులకు నోటీసులు జారీ చేసి రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోనేల విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రాజీపడదగు 152 పెండింగ్ ఉన్న నెగోషి యబుల్ ఇన్స్టుమెంట్స్ చట్టం చెక్కు బౌన్స్ కేసులను గుర్తించి కేసులను పరిష్కరిం చుటకు తగినన్ని ఏర్పాటు చేసి, కక్షిదారుల సమయం వృధా కాకుండా, ఎటువంటి నిరుత్సాహానికి గురికాకుండా, వీలైనంత త్వరలో కేసు పరిష్కరించబడేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతం చేయడంలో ప్రతీ ఒక్కరు తమవంతుగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి సలహాలకైనా, సందేహాలకైనా, ఏదేని న్యాయ సహాయం కోసమైనా న్యాయసేవాధికార సంస్థ ను ఆశ్రయించి, ఉచిత న్యాయ సలహాలు, సూచనలు పొందాలని తెలిపారు. లోక్ అదాలత్ పట్ల మరింత సమాచారం కోసం 15100 నంబర్ కు కాల్ చేసి. సందేహాల ను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే. అవినాష్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# వీసురవరం ఆశయాలను కొనసాగిద్దాం

## - సురవరం ప్రతాప్‌రెడ్డికి బీఆర్ఎస్ నేతల నివాళి

**వనపర్తి, ఆగస్టు 25 (ప్రజాజ్యోతి):**

వనపర్తి తొలి ఎమ్మెల్యే, తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని సురవరం ప్రతాప్‌రెడ్డి పార్కులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సురవరం ప్రతాప్‌రెడ్డి తెలంగాణ వైతాళికుడిగా, ప్రముఖ సాహితీవేత్తగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా విశిష్ట సేవలందించారని కొనియాడారు. 'గోల్కొండ' దినపత్రికను స్థాపించి జర్నలిజం రంగానికి విశేష సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని పేర్కొన్నారు. తెలంగాణ సమాజంలో చైతన్యం తీసుకురావడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్‌గౌడ్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, కురుమూర్తి యాదవ్, ఏర్వ అరుణ శ్రీనివాసులు, చంద్రశేఖర్ నాయక్, గులాం ఖాదర్‌ఖాన్, జోహెబ్ హుస్సేన్, షేక్ జహంగీర్, నీలస్వామి, బొబ్బిలి ప్రేమ్‌కుమార్, వెంకట్ సాగర్, మంద రాము, చిట్యాల రాము, అరీఫ, పాషా, వెంకటేష్ యాదవ్, ఏంట్ల శ్రీను, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.



# రామగిరి వద్ద రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలి

## - బలవంతపు భూసేకరణ ఆపాలి

## - గ్రామ సభలో ఎమ్మార్వోకి సిపిఎం పార్టీ వినతి పత్రం

**నాగర్ కర్నూల్ ఆగస్టు 25 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మాణం రైతుల అభిప్రాయం మేరకే నిర్మాణం చేపట్టాలని బలవంతపు భూసేకరణ చేయరాదని బలుమూరు గ్రామంలో జరిగిన గ్రామసభలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం తాసిల్దార్ కి అందజేశారు. ప్రస్తుత డిజైన్లు మార్చి రామగిరి వద్ద లేదా తెగిన చెరువు దగ్గర రిజర్వాయర్ నిర్మాణం చేస్తే రైతులకు ఎలాంటి అభ్యంతరం లేదని వాటిని పరిగణలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను సిపిఎం పార్టీగా డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శంకర్ నాయక్ మండల నాయకులు లాల్ మమ్మద్ శ్రావణ్ కుమార్ ఆంజనేయులు కృష్ణయ్య బాలరాజు భారీమం పార్టీ సభ్యులు రైతులు పాల్గొన్నారు



# పేద ప్రజల సంక్షేమమే ప్రజా పాలన లక్ష్యం

## - జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ కార్యదర్శి కోరే రేణయ్య

**నాగర్ కర్నూల్ ఆగస్టు 25 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంలో భాగంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డ్ ఇవ్వడం జరిగిందని నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కర్నే రేణయ్య పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమం అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో మంగళవారం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచి ఉడుతనూరి పుష్ప అధ్యక్షత వహించగా, ఈ కార్యక్రమానికి అమ్రాబాద్ తాహసిల్దార్ వెంకటేశ్వర్ రెడ్డి గారు జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ కార్యదర్శి కోరే రేణయ్య ముఖ్యఅతిథిలు గా పాల్గొన్నారు ఈ సందర్భంగా రేణయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం గడిచిన 10 సంవత్సరాలలో రాష్ట్రంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకపోగా పేద ప్రజలను విస్మరించారు ఈరోజు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రోజుకు 18 గంటలు పని చేస్తూ రాష్ట్ర అభివృద్ధికై నిరంతరం శ్రమిస్తున్నారు ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రజల యొక్క ఆశీర్వాదం పొందుతున్నారు పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో ఏ పేదవాడు అయినా ఆకలితో..అలమటించవద్దన్న ఉద్దేశంతో దేశంలో ఎక్కడలేని విధంగా రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి 6 కిలోల సన్న బియ్యం అందిస్తున్నారు యొక్క అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని వారు అన్నారు కార్యక్రమంలో సింగల్ విండో డైరెక్టర్ బొంత జగన్ ఉపసర్పంచ్ జాల అనిత బాలస్వామి పంచాయతీ కార్యదర్శి పద్మ కాంగ్రెస్ కమిటీ గ్రామ అధ్యక్షులు అశోక్ యువజన కాంగ్రెస్ తాలూకా ప్రధాన కార్యదర్శి జక్కా రామాంజనేయులు గ్రామ సీనియర్ నాయకులు రాజలింగం కృష్ణయ్య రాములు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



# పోచమ్మ బోనాలతో మార్మోగిన మండల కేంద్రం.

## గ్రామాల్లో భక్తి సందడి

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.**



మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పోచమ్మ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను తయారు చేసి డప్పు చప్పులు మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి పోచమ్మ తల్లికి సమర్పించారు ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని ముక్కలు చెల్లించుకున్నారు ఈ సందర్భంగా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది మహిళలు యువత చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు గ్రామ ప్రజలంతా హైకంగా పాల్గొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు పోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామాలు సుభిక్షంగా ఉండాలని ప్రజలందరికీ ఆరోగ్యం ఆనందం కలగాలని భక్తులు ఆకాంక్షించారు పండుగ సందర్భంగా ఆలయాల పరిసరాలు భక్తులతో కిటకిటలాడగా గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది



# ఉమ్మడి పాలమూరులో విస్తృతంగా వన మహోత్సవం

## ఒక్కరోజే 70 వేల మొక్కలు నాటిన ప్రజలు

## మొక్కలతో పాటు నీటి, మట్టి సంరక్షణ పనులకు ప్రాధాన్యం

**మహబూబ్‌నగర్, ఆగస్టు 25 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

వన మహోత్సవంలో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ ఎత్తున మొక్కలు నాటడంతో పాటు నీటి, మట్టి సంరక్షణ కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నట్లు జోగులాంబ, యాదాద్రి సర్కిల్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శివాల రాంబాబు తెలిపారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అప్పన్నపల్లి గ్రామంలో టీబీ ఆసుపత్రి మార్గం పక్కన నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వన మహోత్సవంలో భాగంగా వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్, పెర్కొలేషన్ ట్యాంకులు, మినీ పెర్కొలేషన్ ట్యాంకులు, చెక్‌డ్యామ్‌లు వంటి నీటి, మట్టి సంరక్షణ నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు నేల కోతను అరికట్టేందుకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు.




### అన్ని శాఖల సమిష్టి భాగస్వామ్యం:

వన మహోత్సవం కేవలం అటవీ శాఖకు మాత్రమే పరిమితమైన కార్యక్రమం కాదని, అన్ని ప్రభుత్వ శాఖల సమిష్టి భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నామని రాంబాబు తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ, మున్సిపాలిటీలు, పరిశ్రమల శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలు కూడా కార్యక్రమంలో విస్తృతంగా భాగస్వాములవుతున్నాయని చెప్పారు. సాధారణ వన మహోత్సవ కార్యక్రమాలకు అదనంగా ఈ ఏడాది భారీ స్థాయిలో మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంతో పాటు ఫారెస్ట్ కాంప్లెక్స్, వివిధ మున్సిపల్ ప్రాంతాల్లోనూ మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. పలువురు ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు, ఇతర జిల్లా స్థాయి అధికారులు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని చెప్పారు.



### ఉమ్మడి జిల్లాల్లో లక్షలాది మొక్కలు:

మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్కరోజే సుమారు 70 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు కన్సర్వేటర్ తెలిపారు. గద్వాల జిల్లాలో సుమారు 32 వేల, నారాయణపేట జిల్లాలో సుమారు 7 వేల, వనపర్తి జిల్లాలో 15 వేలకుపైగా మొక్కలు నాటే కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

### నాటడమే కాదు.. సంరక్షణ కూడా ముఖ్యం:

వన మహోత్సవంలో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని రాంబాబు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ.. ప్రజలందరూ వన మహోత్సవంలో భాగస్వాములై మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పి. శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇస్రా నాయక్, డిప్యూటీ రేంజ్ అధికారి ఎం.డి. జకిరుద్దీన్, అటవీ శాఖ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- మెస్ ఛార్జీలు విడుదల చేసి, రెగ్యులర్ వార్డెన్లను నియమించాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్

**నాగర్ కర్నూల్ ఆగస్ట్ 25 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

అచ్చంపేట నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో..చదువుకుంటున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. హాస్టళ్లను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్న అనంతరం ఆయన ఈ మేరకు ప్రభుత్వాన్ని కోరారు. హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న మెస్ ఛార్జీలను వెంటనే విడుదల చేయడంతో పాటు, విద్యార్థులకు సరైన భోజనం, బెడ్లు, పరుపులు, తాగునీరు, మరుగుదొడ్లు, దోమల నివారణకు కిటికీలకు జాలీలు వంటి మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలకు మరమ్మతులు చేపట్టి, అవసరమైన చోట నూతన భవనాలు నిర్మించాలని కోరారు. అలాగే బాలుర, బాలికల హాస్టళ్లకు రెగ్యులర్ వార్డెన్లను నియమించి, అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులు చదువును కొనసాగించేందుకు ప్రభుత్వ హాస్టళ్లపై ఆధారపడుతున్నారని, వారి సమస్యలను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. హాస్టళ్ల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారం చూపకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అచ్చంపేట నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని బలముల ప్రేమ్ కుమార్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రీతం, వినయ్, మహేష్, శివ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి సంరక్షించాలి

## - పచ్చని పాఠశాలలే లక్ష్యంగా మొక్కల సంరక్షణ

## - భవిష్యత్ తరాల కోసం విస్తృతంగా మొక్కలు నాటాలి

**నాగర్ కర్నూల్ ఆగస్టు 25 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

పెద్ద ముద్దునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా వన మహోత్సవం,విద్యార్థినితో కలిసి మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని బాధ్యతగా సంరక్షించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పిలుపునిచ్చారు.



నాగర్ కర్నూల్ మండల పరిధిలోని పెద్ద ముద్దునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ముఖ్యఅతిథిగా హాజరై అధికారులు, అటవీ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, మాట్లాడుతూ. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దానిని బాధ్యతగా సంరక్షించాలని పిలుపునిచ్చారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాలు, ఖాళీ ప్రదేశాల్లో విస్తృతంగా మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంచాలని అన్నారు. వృక్షాలు మనకు ఆక్సిజన్‌ను అందించడంతో పాటు వాతావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ తెలిపారు. వర్షపాతం పెరగడం, భూగర్భ జలాల పరిరక్షణ, నేల కోతను అరికట్టడం వంటి అనేక ప్రయోజనాలు చెట్ల వల్ల కలుగుతాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములను చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.జిల్లాలో వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అటవీ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే విధంగా బాధ్యతలు కేటాయించి, మొక్కల ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను సూచించారు.వనమహోత్సవంలో భాగంగా విద్యార్థులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటి, వాటికి నీరు పోశారు. పాఠశాల ఆవరణలో జామ, నేరేడు, మామిడి తదితర రకాల 100 మొక్కలను విద్యార్థులు నాటారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ, అవసరమైన సంరక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దానిని కుటుంబ సభ్యుడిలా భావించి సంరక్షిస్తే పచ్చని పాఠశాలలు, పచ్చని గ్రామాలు, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి రేవంత్ చంద్ర, గ్రామ సర్పంచు ఊర్మిలమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, అటవీ శాఖ అధికారులు, నాగర్ కర్నూల్ ఎంపీడీవో చెన్నమ్మ , నగర్ కర్నూల్ ఎంఈఓ కురుమయ్య, పాఠశాల,ప్రధానోపాధ్యాయుడు మోహనా చారి,అటవీ శాఖ అధికారులు, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# వరికి ప్రత్యామ్నాయంగా సాగును ప్రోత్సహిస్తున్నాం

**నాగర్ కర్నూల్ ఆగస్టు 25 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

నీట్ పీజీ,2026 పరీక్ష నిర్వహణ, పర్యాటక అభివృద్ధి సమస్యలు, వాతావరణ పరిస్థితులు, సీజనల్ వ్యాధులు, వ్యవసాయ, వరంగల్ మెగా గ్రోత్ కారిడార్ ఏర్పాటు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం హైదరాబాద్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు జిల్లాల ఎప్పిల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి డీఎఫ్ఓ రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ చెన్నయ్య, ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్ , తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పాల్గొన్నారు నాగర్ కర్నూల్ జిల్లాలో వ్యవసాయ రంగాన్ని మరింత లాభదాయకంగా మార్చేందుకు వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటి వినియోగంతో అధిక ఆదాయం అందించే పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిస్థితులను కలెక్టర్ వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, మాట్లాడుతూ...... జిల్లాలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత, పంటల సాగు పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్, మొక్కజొన్న, బిందు సేద్యం ద్వారా కూరగాయల సాగు, ఇతర లాభదాయకమైన ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు.రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా మార్కెట్ డిమాండ్, నీటి లభ్యత, పంటల ద్వారా వచ్చే ఆదాయం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,ప్రత్యామ్నాయ పంటల సాగుతో నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు రైతులకు మెరుగైన ఆదాయం కల్పించే అవకాశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. బిందు సేద్యం వంటి ఆధునిక సాగు పద్ధతులను రైతులకు పరిచయం చేసి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సాంకేతిక సహాయాన్ని వినియోగించుకునేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఉద్యాన పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలోని భౌగోళిక, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు అనువైన పంటలను గుర్తించి వాటి సాగుపై అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ వివరించారు.నాగర్ కర్నూల్ జిల్లాలో సోమశిల, నల్లమల్ల అటవీ ప్రాంతంలోని మన్ననూరు ఏకో టూరిజం, పర్యాటక రంగానికి ఉన్న అపారమైన అవకాశాలను వినియోగించుకునే దిశగా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రకృతి, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన పర్యాటక ప్రాంతాలను గుర్తించి వాటి అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు.పర్యాటక ప్రాంతాలకు రహదారి సౌకర్యం, తాగునీరు, పారిశుధ్యం, పార్కింగ్, సందర్శకులకు అవసరమైన ఇతర సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ముఖ్యంగా జిల్లాలో ఉన్న పర్యాటక వనరులను సద్వినియోగం చేసుకొని మరింతగా అంటే ఒకటి రాకుండా జిల్లాలోని వస్తాయి పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ద్వారా స్థానికంగా ఉపాధి, ఆదాయ అవకాశాలు పెరిగేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి వివరించారు.నాగర్ కర్నూల్ జిల్లాను రాష్ట్రంలోని పర్యాటక రంగంగా అభివృద్ధి పరిచే దిశగా జిల్లా యంత్రాంగం కృషి చేయనున్నట్లు తెలిపారు.జిల్లాలో వ్యవసాయం, ఉద్యాన పంటలు, పర్యాటకం, తాగునీరు తదితర రంగాల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో డిఆర్ఓ పాండు, జ్ఞాన శేఖర్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిని సుజాత జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, జిల్లా హార్టికల్చర్ అధికారి వెంకటేశం, జిల్లా వెటర్నరీ అధికారి తదితరులు పాల్గొన్నారుడ.

- ఆయిల్‌పామ్, మొక్కజొన్న, కూరగాయలు, ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన

- జిల్లాలో సోమశిల, నల్లమల్ల టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఎకో టూరిజం ,పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి

- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్





# క్రీడలతో ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయి

- చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి.

- జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)**

చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక విద్యార్థులకు సూచించారు. క్రీడల ద్వారా ఆరోగ్యం, శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని ఆమె పేర్కొన్నారు. జిల్లా మహిళా అభివృద్ధి/ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "బేటీ బచావో బేటీ పడావో" కార్యక్రమంలో భాగంగా జిల్లా క్రీడల శాఖ సహకారంతో మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో కౌమార దశ బాలికల జిల్లా స్థాయి స్పోర్ట్స్ టోర్నమెంట్ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రియాంక సరస్వతీదేవి, హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూజలు నిర్వహించి, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులు నిర్వహించిన క్రీడా వందనాన్ని ఆమె స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులను, ముఖ్యంగా బాలికలను క్రీడల్లో ప్రోత్సహించడం ద్వారా వారి ఆరోగ్యం, శారీరక దారుఢ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. క్రీడలు కేవలం గెలుపు, ఓటములకు మాత్రమే పరిమితం కావని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని కూడా క్రీడలు నేర్పిస్తాయని తెలిపారు. ఓటమిని స్వీకరించి, దాని నుంచి పాఠాలు నేర్చుకుని మరింత పట్టుదలతో ముందుకు సాగి విజయం సాధించడం క్రీడాస్ఫూర్తిలో భాగమని కలెక్టర్ పేర్కొన్నారు. క్రీడా పోటీల్లో విజేతలతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరినీ ఆమె అభినందించారు. పోటీల్లో పాల్గొనడం కూడా ఒక విజయమేనని, విద్యార్థులు చురుగ్గా, ఉత్సాహంగా అన్ని కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.విద్యార్థులను క్రీడా పోటీలకు తీసుకువచ్చిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పీఈటీలను కలెక్టర్ అభినందించారు.బాల్య వివాహాల నిర్మూలనకు అందరి సహకారం అవసరంకార్యక్రమం ప్రధాన సందేశమైన లి"బేటీ బచావో బేటీ పడావో"లిను కలెక్టర్ ప్రస్తావిస్తూ, ఆడపిల్లలను రక్షించడంతో పాటు వారికి నాణ్యమైన విద్య అందించి అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.నారాయణపేట జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో పాటు సామాజిక బాధ్యతను కూడా కలిగి ఉండాలని, బాల్య వివాహాల వంటి సామాజిక సమస్యల నిర్మూలనలో తమ వంతు పాత్ర పోషించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ తో కలిసి ధన్వాడ కేజీబీవీ, మక్తల్ కేజీబీవి జట్ల మధ్య ప్రారంభ కబడ్డీ ఆటను స్వయంగా కలెక్టర్ ఆడి ప్రారంభించారు. అలాగే నర్వ కేజీబీవి, జ్యోతిబా పూలే నర్వ కళాశాల బాలికల జట్టు మధ్య ఖో ఖో ఆటను కూడా ఆమె ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్‌పర్సన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి, డీడబ్ల్యూఓ రాజేందర్ గౌడ్, డీవైఎస్‌వో వెంకటేష్ శెట్టి, సీ డబ్ల్యు సీ చైర్మన్ అశోక్ శ్యామల, డీసీపీవో కరిష్మా, ఆ వార్డు కౌన్సిలర్ కందేన్‌పల్లి సత్యమ్మ, కౌన్సిలర్లు నాగమ్మ, కల్పన, గొల్ల రవి తేజ యాదవ్, రాము, ప్రభాకర్, రాజేశ్ ఘట్, పీఈటీలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, జిల్లాలోని 25 జూనియర్ కళాశాలలు, 4 డిగ్రీ కళాశాలలకు చెందిన సుమారు 600 మంది బాలికలు ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు.






# పచ్చదనమే భవిష్యత్తుకు బాట..

## విద్యార్థులకు ఎంపీడీఓ పిలుపు

**చిన్నంబావి, ఆగస్టు 25, (ప్రజా జ్యోతి)**

పచ్చదనమే భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాట అని చిన్నంబావి మండల ఎంపీడీఓ ఆదర్శ్ గౌడ్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు.వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం పెద్దమారూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గ్రామ సర్పంచ్ కేతపగ జయమ్మ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సుమారు 40 మొక్కలు నాటారు.మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు.గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆదర్శ్ గౌడ్ తాసిల్దార్ శ్రీనివాస్, మాట్లాడుతూ.. "నా మొక్క.. నా బాధ్యత" అనే భావనతో ప్రతి విద్యార్థి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇళ్లలో, పాఠశాలల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని తెలిపారు. మొక్కలు పెంచడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ రామస్వామి, ఏపీఓ ధనుంజయ రాజు, ఉప సర్పంచ్ నరేష్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి బి. శ్రీనివాసులు, పాఠశాల ప్రత్యేక అధికారి సుజాత, కస్తూర్బా పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు కృష్ణయ్య, బాలకృష్ణ, బాలస్వామి, శ్రీనివాసులు, గడ్డం నరసింహ, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.







# మొక్కలు నాటడమే కాదు.. వాటిని సంరక్షించాలి

- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి.
- పేటలో వన మహోత్సవాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక.

నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)

పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ఒక కార్యక్రమంగా కాకుండా నిరంతర బాధ్యతగా భావించాలని సూచించారు.మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్ర మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు గాయత్రి నగర్‌లోని మున్సిపాలిటీ లే అవుట్ ఖాళీ స్థలంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. "పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణం అందించాలంటే పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు వాటిని బతికించే బాధ్యతను కూడా తీసుకోవాలి" అని అన్నారు.జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలో ఉన్న లే అవుట్ ఖాళీ స్థలాలను గుర్తించి, అందుబాటులో ఉన్న ప్రతి స్థలాన్ని పచ్చదనంతో నింపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు, రోడ్ల వెంట, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు, పాఠశాలలు, కళాశాలలు, ఇతర ప్రభుత్వ సంస్థల పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిర్దేశించిన ప్రదేశాలను గుర్తించి స్థానిక ప్రజలు, మహిళా సంఘాలు, యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి మొక్కను ఒక కుటుంబ సభ్యుడిలా భావించి సంరక్షించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు."మొక్క నాటిన తర్వాత దానికి నీరు అందుతున్నదా? రక్షణ కల్పిస్తున్నారా? అది పెరుగుతున్నదా? అనే అంశాలను నిరంతరం పర్యవేక్షించాలి. మొక్కలు నాటిన సంఖ్య కంటే బతికిన మొక్కల సంఖ్యే మన విజయానికి కొలమానం కావాలి" అని కలెక్టర్ స్పష్టం చేశారు.వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లాలో నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం, పశువుల నుంచి రక్షణ కల్పించడం, అవసరమైన చోట ట్రీ గార్డులు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. మహిళా సమాఖ్యలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మొక్కల ప్రాధాన్యతపై అవగాహన కల్పించి, వారు నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను వారికి అప్పగించేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.పచ్చదనం పెరిగితే వాతావరణ సమతుల్యత మెరుగుపడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణం అందుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. వర్షపాతం, భూగర్భ జలాల పరిరక్షణ, జీవ వైవిధ్యం, గాలి



నాణ్యత వంటి అంశాలపై చెట్లు ఎంతో ప్రభావం చూపుతాయని తెలిపారు. అందువల్ల ప్రతి ఇంటి పరిసరాల్లో, ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో వీలైనంత ఎక్కువగా మొక్కలు నాటేలా ప్రజలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా పట్టణ మహిళా సమాఖ్య సభ్యులు మెప్మా ఆధ్వర్యంలో రైస్ మిల్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రైస్ మిల్లు నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ శంకర్‌ను ఆదేశించారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు, స్వయం ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మంజుల, వార్డు కౌన్సిలర్ భరత్, డీఆర్డీవో వెంకట్ రాములు, జిల్లా అటవీ శాఖ అధికారి గణేశ్, రేంజ్ అధికారి కమాలుద్దీన్, కౌన్సిలర్లు కల్పన, నాగమ్మ, ప్రభాకర్, రాము, డీటీసీపీవో కిరణ్, పర్యావరణ ఇంజినీర్ భరత్, మున్సిపల్ సిబ్బంది, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి రైతు వివరాలు DCS యాప్‌లో నమోదు చేయాలి

ప్రజాజ్యోతి గండీడ్:



వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందుతున్న పథకాలు, సేవలను సమర్థవంతంగా అందించేందుకు రైతుల వివరాలను ఇజూ యాప్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులు సూచించారు. ప్రతి రైతు తనకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు.రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సంబంధిత సేవలు అర్హులైన రైతులకు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి, ప్రతి రైతు వివరాలు యాప్‌లో నమోదు అయ్యేలా చూడాలని అధికారులను కోరారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.

## చిన్నంబావి ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక నేడే

చిన్నంబావి, ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)

ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక బుధవారం నిర్వహించనున్నారు. మండల కేంద్రంలోని సునీత.ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10.30 గంటలకు ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎమ్మార్పీఎస్ నాయకులు పత్రికా ప్రకటనలో తెలిపారు. మండలంలోని 17 గ్రామపంచాయతీల పరిధిలోని మాదిగలు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల వనపర్తి జిల్లా ఇన్‌చార్జి కొమ్మువారి మస్తాన్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు కొమ్ము కేశవులు, మీసాల నాగరాజు, గంధం గట్టయ్య ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. మండల ఇన్‌చార్జి దేవని రమేష్ మాదిగతో పాటు సీనియర్ నాయకులు సంపంగి మద్దిలేటి, కత్తి కురుమూర్తి, వడ్డెమాన్ రామకృష్ణ తదితరులు పాల్గొననున్నారు.మాదిగ దండోరా కార్యకర్తలు, విద్యార్థులు, గ్రామపెద్దలు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన మండల కమిటీ ఎన్నికను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.



# 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక.






నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)

రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని, ప్రతి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తూ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు వర్షాభావ పరిస్థితులు, నీట్‌పీజీ పరీక్ష ఏర్పాట్లు, పర్యాటక అభివృద్ధి తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.నారాయణపేట కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు మాట్లాడుతూ,రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని, ప్రతి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తూ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.ఆధ్యాత్మిక, చారిత్రక, వారసత్వ, ఎకో టూరిజం, హస్తకళలు, జల పర్యాటక ప్రాంతాలను గుర్తించి వాటిని అనుసంధానిస్తూ పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, శుభ్రత, సూచిక బోర్డులు, ఇతర సందర్శకుల సౌకర్యాలను మెరుగుపరచాలని సీఎస్ ఆదేశించారు. ప్రతి ప్రత్యేక పర్యాటక ప్రాంతానికి స్పష్టమైన అభివృద్ధి కార్యాచరణ, బాధ్యతలు, కాలపరిమితి రూపొందించి పనుల పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. స్థానిక కళలు, హస్తకళలు, స్థానిక ఆహారం, సంస్కృతికి ప్రాధాన్యతనిస్తూ స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, హోమ్‌స్టేలు, స్థానిక గైడ్ సేవలను ప్రోత్సహించాలని తెలిపారు.తెలంగాణ సంస్కృతి, కళలు, హస్తకళలు, చారిత్రక వారసత్వం, స్థానిక ఆహారం, పండుగలు, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా బ్రాండ్ తెలంగాణ'కు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని సీఎస్ తెలిపారు. జిల్లాలో చేపట్టిన వినూత్నమైన, ప్రజలను ఆకర్షించే కార్యక్రమాలను ఇతర జిల్లాల్లోనూ చేపట్టి, ఆయా జిల్లాల్లోని పర్యాటక ప్రదేశాలకు విస్తృత ప్రచారం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు.ఆగస్టు 30న నిర్వహించనున్న నీట్‌పీజీ 2026 ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాల్లో 17,627 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటలకు ముగుస్తుందని, అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్, జనరేటర్ బ్యాకప్, వెలుతురు, వెంటిలేషన్ తదితర మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉండేలా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని సీఎస్ తెలిపారు. అభ్యర్థుల గుర్తింపు, తనిఖీలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, మొబైల్ ఫోన్లు, బ్లూటూత్ పరికరాలు, ఏఐ గ్లాసెస్, స్పై కెమెరాలు తదితర నిషేధిత వస్తువులను అనుమతించరాదని ఆదేశించారు. ప్రశ్నాపత్రాల భద్రత, గోప్యతకు పూర్తి రక్షణ కల్పించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.రాష్ట్రంలో ప్రస్తుతం 22 శాతం లోటు వర్షపాతం నమోదైందని, సెప్టెంబర్ చివరి వరకు పెద్దగా వర్షాలు కురిసే అవకాశం లేదని వాతావరణ నిపుణులు సూచించినట్లు సీఎస్ తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.20 కోట్ల ఎకరాల్లో పంటల సాగు జరిగిందని, గత వానాకాలంలో సుమారు 1.38 కోట్ల ఎకరాల్లో సాగు జరిగినట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు, సాగునీరు, తాగునీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డి ఆర్ ఓ రాజేశ్వరి, ట్రైనీ ఎస్ . డి.సి.ఫణి, సిపిఒ, ఖగవాహన టూరిజం అధికారి రషీద్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిపిఎఫ్ సమస్యలపై కలెక్టర్ కు తపస్ వినతి

నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)

జిపిఎఫ్ సమస్యలు అనేక మార్లు జిల్లా పరిషత్ కార్యాలయంలో విన్నవించినప్పటికీపరిష్కారం కావడం లేదని వాటిని త్వరగా పరిష్కారం చేయాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పించడం జరిగింది. జిపిఎఫ్ ఆన్లైన్ చేయడం వేగవంతంగా జరగాలని, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు త్వరగా ఫైనల్ పేమెంట్ చేయాలని, మిస్సింగ్ క్రెడిట్ పూర్తి చేయాలని కలెక్టర్ గారికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నరసింహ జిల్లా కోశాధికారి కిషోర్ కుమార్, జిల్లా సహాకోశాధికారి శ్రీనివాస్, పేట మండల అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, చిన్న నరసింహులు పాల్గొన్నారు.



# మిలాద్-ఉన్-నబి ర్యాలీని శాంతియుతంగా నిర్వహించాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)



బుధవారం నిర్వహించనున్న మిలాద్-ఉన్-నబి పండుగ ర్యాలీని శాంతియుతంగా, సామరస్యపూర్వకంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఖ్రూా ముస్లిం కమిటీ సభ్యులు, ప్రజలకు సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...
మిలాద్-ఉన్-నబి ర్యాలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన చోట్ల ట్రాఫిక్ డైవర్షన్లు, పోలీస్ పికెట్లు, ప్రధాన చౌరస్తాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరిస్తూ కులమతాలకు అతీతంగా పండుగను శాంతియుత వాతావరణంలో, సోదరభావంతో నిర్వహించుకోవాలని ఎస్పీ కోరారు. అలాగే సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ తదితరాల్లో ఇతర మతాలు, వర్గాల మనోభావాలను కించపరిచేలా, రెచ్చగొట్టేలా లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎలాంటి అనుచిత పోస్టులు, వ్యాఖ్యలు చేయరాదని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు, సందేశాలపై సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ద్వారా నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా లేదా ఇతరులకు ఇబ్బంది కలిగించేలా పోస్టులు, సందేశాలు ప్రచారం చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

# ఆసుపత్రులు, క్లినిక్‌ల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి - జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)**

సీ ఈ ఏ -2010, పీ సీ పీ ఎన్ డీ టీ చట్టాల అమలుపై జిల్లా స్థాయి బహుళ సభ్యుల అధికార కమిటీ సమావేశం మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రియాంక అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన 151 క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ల రిజిస్ట్రేషన్, పునరుద్ధరణ, అనుమతులు, తనిఖీలు, పనితీరుపై కలెక్టర్ సమీక్షించారు. కొత్తగా 15 సంస్థల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందని అధికారులు తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ల రిజిస్ట్రేషన్, అనుమతులు, పునరుద్ధరణ దరఖాస్తులను ఇకపై ఆన్‌లైన్‌లోనే స్వీకరించి, నిర్ణీత సమయంలో ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గడువు ముగిసిన సంస్థల పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆర్ఎంపీ క్లినిక్‌లు, అనధికార వైద్య సంస్థలపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

**రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి**

ఆసుపత్రులు, క్లినిక్‌లలో వైద్య సిబ్బంది, పరికరాలు, రికార్డుల నిర్వహణ, రోగుల భద్రత, వైద్య సేవలను అధికారులు నిరంతరం తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రోగుల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా నిబంధనల ప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సూచించారు.

**పీసీపీఎన్ డీటీ చట్టం కఠినంగా అమలు చేయాలి**

లింగ నిర్ధారణ పరీక్షలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకుండా పీ సి పీ ఎన్ డీ టీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్కానింగ్ కేంద్రాలను నిరంతరం తనిఖీ చేసి రికార్డులు, ఫారాలు, రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలించాలని సూచించారు. జిల్లాలో లింగ నిష్పత్తి 1000:982గా ఉందని అధికారులు వివరించగా, బాలికల పట్ల వివక్ష నివారణకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. స్కానింగ్ కేంద్రాలు, ఆసుపత్రులపై ఆకస్మిక తనిఖీలు



నిర్వహించాలని, ఉల్లంఘనలపై సమాచారం అందిన వెంటనే విచారణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయచంద్రమోహన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సిద్ధప్ప, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మల్లికార్జున్, సఖీ కేంద్రం ఇన్‌చార్జ్ క్రాంతిరేఖ, డీపీఓ బిక్షపతి, కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వెన్నచేడ్‌లో ఘనంగా వన మహోత్సవం

## మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపు

**గండీడ్, :**

గండీడ్ మండలం వెన్నచేడ్ గ్రామంలోని్రావీ ాష్ట్రతీఱ దీశీఎం ాఎష్ట్రశీశీశ్రీలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలోని మదర్ ట్రీకి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య, పాఠశాల హెచ్ఎం రవిబాబు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మొక్కల పెంపకం ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచడం వల్ల విద్యార్థులకు పచ్చదనం ప్రాధాన్యతపై అవగాహన కలుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామ విలేజ్ సెక్రటరీ చెన్నకేశవులు, ఉప సర్పంచ్ రవికాంత్ రెడ్డి, వార్డు సభ్యులు శేఖర్, ఆంజనేయులు, నరేష్, మాజీ ఎంపీటీసీ రేణుక దశరథ్, బాలయ్య, రాములు, నరసింహులు, ఆనందు తదితరులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కూడా పాల్గొని వన మహోత్సవం ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా "మొక్క నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం.. భావితరాలకు పచ్చని భవిష్యత్తును అందిద్దాం" అనే సందేశంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.



# మొక్కలు పెంచితేనే మనుగడ సాధ్యం

## - ఒక్క మొక్క నాటితే 100 మందికి ప్రాణవాయువు

## విద్యార్థి చేతుల్లో పచ్చని భవిష్యత్తు నారాయణపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీను

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 28 (ప్రజా జ్యోతి)**

మంగళవారం రోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో మొక్కలు పెంచితేనే మనుగడ సాధ్యమని నారాయణపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీను అన్నారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ పాఠశాలలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్లోబల్ వార్మింగ్ తో భూమి వేడెక్కుతోంది. వర్షాలు తగ్గిపోతున్నాయి. దీనికి పరిష్కారం ఒక్కటే - మొక్కలు నాటడం. ప్రతి విద్యార్థి తన పుట్టినరోజున ఒక మొక్క నాటి భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారుగ్రామ సర్పంచ్ కే సంగీత మాట్లాడుతూ చెట్టు మనకు ప్రాణవాయువును ఇస్తుంది. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి కాపాడితేనే భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణం అందుతుంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ విద్యార్థులు చేస్తున్న ఈ కార్యక్రమం అందరికీ ఆదర్శం"పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూమా పాఠశాలను పచ్చని పాఠశాలగా తీర్చిదిద్దాలనేదే మా లక్ష్యం. ప్రతి విద్యార్థి ఒక మొక్కకు తల్లిదండ్రుల్లా బాధ్యత తీసుకోవాలి. మొక్కలతోనే మన ఆరోగ్యం ముడిపడి ఉంది తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో అమరేందర్ ఎంపీడీవో విజయలక్ష్మి ఏపీవో మొగలప్ప ఎం పి ఓ బాలాజీ జాజాపూర్ గ్రామ సెక్రెటరీ వేణుగోపాల్ మరియు ఉప సర్పంచ్ లక్ష్మణ్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోట్ల రవీందర్ రెడ్డి కె రాములు పాఠశాల ఉపాధ్యాయ బృందం భాను ప్రకాష్ నిర్మల నరసింహ లక్ష్మణ్ రఘురాం రెడ్డి వెంకటేష్ మరియు అంగన్వాడి టీచర్స్ చైతన్య రాధిక విద్యార్థులు పాల్గొన్నారు



# పోలీస్ అధికారుల సంఘం ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

- పోలీసుల సంక్షేమానికి కృషి చేయాలి. ఎస్పీ - గెలుపోటములు సమానంగా స్వీకరించాలి.

- వివిధ విభాగాలు, సర్కిళ్ల నుంచి ప్రతినిధులుగా పోలీసు సిబ్బంది ఎన్నిక








**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట జిల్లా పోలీస్ అధికారుల సంఘం (ూూా) ఎన్నికలు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ గారు, ూూా ఆధ్వర్యంలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించబడ్డాయి. డీజీపీ, తెలంగాణ రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ఎన్నికల్లో వివిధ సర్కిళ్లు, విభాగాలకు చెందిన పోలీసు సిబ్బంది ప్రతినిధులుగా ఎన్నికయ్యారు.ఎన్నికైన ప్రతినిధుల వివరాలు:- నారాయణపేట సర్కిల్: యాదయ్య,ూజ 1191 (నారాయణపేట టౌన్ూూ), కే. రాజు,ూజ 2150 (దామరగిద్దూూ) ఎన్నికయ్యారు.- మక్తల్ సర్కిల్: ఎస్. సుధాకర్, ఎజ 1431 (మక్తల్ూూ), పి. లక్ష్మీనారాయణ, ఎజ 1361 (కృష్ణూూ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.- కోస్గి సర్కిల్: పరంధాములు,ూజ 572 (మద్దూర్ూూ) ఎన్నికయ్యారు.- మారికల్ సర్కిల్: ఎం. మురళీకృష్ణ,ూజ 2670 (నార్వాూూ) ఎన్నికయ్యారు.- ఖూదీ: ఏ. శ్రీనివాస్,ూజ 2534 ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.- పోలీస్ కంట్రోల్ రూమ్: తిలక్ కుమార్,ూజ 3244 ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.` ASI\T/SIలు: ఏ. వెంకటేశ్వర్లు, సబ్ఇన్స్పెక్టర్, నారాయణపేట టౌన్ ఎన్నికయ్యారు.- ఇన్స్పెక్టర్లు/=×ం: శివశంకర్, జ×, నారాయణపేట ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.- మహిళా సిబ్బంది: డి. శ్రీదేవి, ఔఎజ 1993, ణజ=దీ నారాయణపేట; కావ్యారెడ్డి, ఔూాూ 2886, ణూ= నారాయణపేట ఎన్నికయ్యారు.- DAR`AR SI\T/RSI\T: శివశంకర్, RSI, DAR నారాయణపేట ఎన్నికయ్యారు.` DAR`AR ` HCs/AR PCs: - బి. మహేష్, -ూూూజ 2103; - వి. పవన్ కుమార్,ూూూజ 1869; - జి. రమేష్,ూూూజ 2892; - రవి,ూూూజ 2715 ఎన్నికయ్యారు.

ఎన్నికల ప్రక్రియ మొత్తం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించబడింది. ఎన్నికైన ప్రతినిధులకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపి, పోలీసు సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్ హుల్ హక్, ఎన్నికల నోడల్ అధికారి ణజ=దీ డీఎస్పీ మహేష్, సీఐ లు, ఎస్ఐ లు పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# వనమహోత్సవంతో పర్యావరణ పరిరక్షణకు కృషి:జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

**గద్వాల ఆగస్టు25(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించి పెంచినప్పుడే పర్యావరణ పరిరక్షణకు నిజమైన కృషి చేసినట్లవుతుందని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు.అటవీ శాఖ,గద్వాల మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని 18వ,వార్డు పరిధిలోని ఓ వెంచర్లో 10 శాతం స్థలంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో పాటు అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు,మున్సిపల్ చైర్పర్సన్ జయలక్ష్మి,ఇతర జిల్లా అధికారులు హాజరై మొక్కలు నాటారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ,రాష్ట్రంలో అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి ఏటా వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు.కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు భావితరాల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెరగడం వల్ల ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు వర్షపాతం మెరుగై, పంటలు సమృద్ధిగా పండే అవకాశం ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్,కౌన్సిలర్లు,జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా,పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్,సర్వే ఏడీ నూకరాజు,అటవీ శాఖ అధికారి పర్విజ్ అహ్మద్,మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్,ఎన్జీసీ జిల్లా సమన్వయకర్త శ్రీధర్, మున్సిపల్ సిబ్బంది,ఎన్సీసీ,స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# అలంపూర్,గద్వాల కోట,నిజాం కొండను అభివృద్ధి చేస్తాం:అదనపు కలెక్టర్ మధుమోహన్

## - పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

**గద్వాల ఆగస్టు 25(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జిల్లాలోని అలంపూర్,నిజాం కొండ,గద్వాల కోట తదితర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ మధుమోహన్ తెలిపారు.మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు,వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి వర్షాభావ పరిస్థితులు,నీట్‌పీజీ పరీక్ష ఏర్పాట్లు,పర్యాటక అభివృద్ధి తదితర అంశాలపై హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు,సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.గద్వాల ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ మధుమోహన్ సంబంధిత అధికారులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ,తెలంగాణను దేశ, విదేశీ పర్యాటకులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా తీర్చిదిద్ది,'బ్రాండ్ తెలంగాణ'ను ప్రపంచస్థాయిలో బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లను ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని,ప్రతి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తూ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. యాదాద్రి,భద్రాచలం,బాసర,వరంగల్,అలంపూర్,కీసరగుట్ట,కల్వకుర్తి,మెదక్,నల్గొండ, పోచంపల్లి,కరీంనగర్,చార్మినార్,గోల్కొండ,వేడిగడ్డ,ఏటూరునాగారం,నాగార్జునసాగర్, మహబూబ్‌నగర్,నార్సాపూర్,చేర్యాల తదితర ప్రాంతాలతో పాటు బుద్ధ వాటర్ ట్రెయిల్ సర్క్యూట్,బౌద్ధ సర్క్యూట్‌లను సమగ్ర పర్యాటక గమ్యస్థానాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు.పర్యాటక ప్రాంతాల్లో రహదారులు,పార్కింగ్,తాగునీరు, మరుగుదొడ్లు,విద్యుత్,పారిశుద్ధ్యం,సూచిక బోర్డులు తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సీఎస్ ఆదేశించారు.ప్రతి పర్యాటక ప్రాంతానికి స్పష్టమైన అభివృద్ధి కార్యాచరణ,బాధ్యతలు,కాలపరిమితిని రూపొందించి పనుల పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు.స్థానిక కళలు,హస్తకళలు,ఆహారం, సంస్కృతికి ప్రాధాన్యం కల్పిస్తూ స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, హోమ్‌స్టేలు,స్థానిక గైడ్ సేవలను ప్రోత్సహించాలని తెలిపారు.తెలంగాణ సంస్కృతి, కళలు,హస్తకళలు,చారిత్రక వారసత్వం,స్థానిక ఆహారం,పండుగలు,సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా 'బ్రాండ్ తెలంగాణ'కు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని సీఎస్ పేర్కొన్నారు.ఫెయిర్లు,ఫెస్టివల్స్,వారసత్వ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.సమగ్ర తెలంగాణ పర్యాటక పోర్టల్,కృత్రిమ మేధ ఆధారిత ప్రయాణ ప్రణాళికలు,రియల్‌టైమ్ డేటా వ్యవస్థల ద్వారా పర్యాటకులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు.పర్యాటక ప్రాంతాల సహజ,చారిత్రక ప్రత్యేకతలను కాపాడుతూ పర్యావరణహితంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

**నీట్‌పీజీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు**

ఆగస్టు 30న నిర్వహించనున్న నీట్‌పీజీ 2026 ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు,మరుగుదొడ్లు,పారిశుద్ధ్యం,విద్యుత్,జనరేటర్ బ్యాకప్, వెంటిలేషన్ తదితర మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉండేలా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని సూచించారు.అభ్యర్థుల గుర్తింపు,తనిఖీలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని,మొబైల్ ఫోన్లు,బ్లూటూత్ పరికరాలు,ఏఐ గ్లాసెస్,స్పై కెమెరాలు తదితర నిషేధిత వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదని ఆదేశించారు. ప్రశ్నాపత్రాల భద్రత,గోప్యతకు పూర్తి రక్షణ కల్పించాలని,అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.







**వర్షాభావంపై అప్రమత్తంగా ఉండాలి**

రాష్ట్రంలో ప్రస్తుతం 22 శాతం లోటు వర్షపాతం నమోదైందని,సెప్టెంబర్ చివరి వరకు పెద్దగా వర్షాలు కురిసే అవకాశం లేదని వాతావరణ నిపుణులు సూచించినట్లు సీఎస్ తెలిపారు.వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు,సాగునీరు,తాగునీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్ మధుమోహన్ జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు.పర్యాటక ప్రాంతాల అభివృద్ధి,నీట్‌పీజీ పరీక్ష నిర్వహణ,వర్షాభావ పరిస్థితులపై సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నర్సింగరావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్‌కుమార్‌రెడ్డి,రాజ్‌కుమార్,జిల్లా పర్యాటక శాఖ అధికారి రామలింగేశ్వర గౌడ్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచితంగా బూట్ల పంపిణీ

**గద్వాల ఆగస్టు 25(ప్రజా జ్యోతి ప్రతినిధి):**



మల్దకల్ గ్రామంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన బూట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్,4వ వార్డు,7వ వార్డు సభ్యుల చేతుల మీదుగా విద్యార్థినీ విద్యార్థులకు బూట్లను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మునగాలహైవే మార్గంలో ఘనంగా వన మహోత్సవం

**గద్వాల (ప్రజా జ్యోతి) ఆగస్టు 25:**

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మునగాల గ్రామం నుంచి హైవే వరకు ఉన్న రహదారి పక్కన ఖాళీ ప్రదేశాల్లో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, గ్రామ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి,వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్,ఉపాధి హామీ కూలీలు పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో రమాదేవి సూచించారు.నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించే బాధ్యతను గ్రామ ప్రజలు తీసుకోవాలని సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి కోరారు.



# భూత్పూర్‌లో నేరాలకు చెక్ పెట్టాలి

## - నేర నియంత్రణే లక్ష్యంగా పటిష్ట నిఘా

## - పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి: జిల్లా ఎస్పీ డి.జానకి

మొదటిపేజీ తరువాయి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 25( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించడంతో పాటు నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం భూత్పూర్ పోలీస్ స్టేషన్‌ను ఆమె తనిఖీ చేసి స్టేషన్‌లోని వివిధ విభాగాలు, రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను పూర్తిగా విని, చట్టపరమైన పరిష్కారం చూపేలా సత్వర స్పందన అందించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచాలని తెలిపారు. భూత్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాల తీరుతో పాటు పెండింగ్, గ్రేవ్ కేసులు, రౌడీషీట్లు, సస్పెక్ట్‌షీట్లు, బైండోవర్ కేసులు, వారెంట్ల అమలు, బీట్ వ్యవస్థ, నేరస్థుల కదలికలపై ఎస్పీ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేరాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ఎన్‌హెచ్-44పై ప్రత్యేక నిఘా:**

భూత్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్‌హెచ్–44 జాతీయ రహదారిపై ప్రతిరోజూ భారీగా వాహనాల రాకపోకలు సాగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. రద్దీ సమయాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు చేపట్టడంతో పాటు ట్రాఫిక్ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు నాణ్యత, సాంకేతిక ఆధారాల సేకరణ, సాక్ష్యాల పరిరక్షణ, సాక్షుల వివరాల నమోదు వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

**రాత్రి గస్తీని మరింత పటిష్టం చేయాలి:**

ముఖ్యమైన, సమస్యాత్మక, రద్దీ ప్రాంతాలతో పాటు నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. పెట్రోలింగ్, బీట్ వ్యవస్థను మరింత పటిష్టంగా అమలు చేస్తూ రాత్రి వేళల్లో గస్తీని సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లోని అన్ని రికార్డులు, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించి శాఖా నిబంధనల ప్రకారం పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, బాధితులు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ తక్షణమే స్పందించాలని సూచించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ స్టేషన్ పరిధిలోని ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తూ సమర్థవంతమైన పర్యవేక్షణ చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారం, నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో





పనిచేసి పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంచాలని సూచించారు. ఈ తనిఖీలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, భూత్పూర్ సీఐ రామకృష్ణ, భూత్పూర్ ఎస్ఐ నాగన్నతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు రూ.25 వేల ఆర్థిక సాయం

**దిశ,మహమ్మదాబాద్:**

మండల కేంద్రానికి చెందిన ఈనాడు రిపోర్టర్ గుల్ల దస్తయ్య భార్య గుల్ల లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతి పట్ల ఉమ్మడి మండలాల జర్నలిస్టులు సంతాపం వ్యక్తం చేసి, కుటుంబానికి అండగా నిలిచారు. లక్ష్మి అంత్యక్రియల నిమిత్తం జర్నలిస్టులు తమవంతు సహాయంగా రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. గండీడ్ మండలం జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు బోయిన గోపాల్, మహమ్మదాబాద్ మండలం జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు కొత్త గోపాల్ అధ్యక్షతన ఉమ్మడి మండలాల జర్నలిస్టులు ఈ సహాయాన్ని సమకూర్చారు. అనంతరం రూ.25 వేల నగదును గుల్ల దస్తయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. దుఃఖ సమయంలో గుల్ల దస్తయ్య కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాలకు చెందిన పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



ప్రజాజ్యోతి

# ఎల్‌నినో ప్రభావం, నీట్‌పీజీ పరీక్ష, పర్యాటక అభివృద్ధిపై సీఎస్ సమీక్ష

**- పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన కల్పించాలి**

**- నీట్‌పీజీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి.. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి**

**మహబూబ్‌నగర్, ఆగస్టు 25 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

రాష్ట్రంలో నెలకొన్న సీజనల్ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వర్షాభావ పరిస్థితులు, ఈ నెల 30న నిర్వహించనున్న నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఏర్పాట్లు, రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా చొంగ్తూ, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పోలీస్ శాఖ డీజీ మహేశ్ భగవత్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి:**

ఎల్‌నినో ప్రభావంతో అంచనా వేస్తున్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులను పంట మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై మరింత చైతన్యపరచాలని సీఎస్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల వారీగా సీజనల్ పరిస్థితులు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చేపడుతున్న ముందస్తు చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అంచనా వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన కాంటింజెన్సీ క్రాప్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. తక్కువ నీటి అవసరం ఉండే, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన పంటలను సాగు చేసేలా రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని తెలిపారు. పంటల వైవిధ్యీకరణలో భాగంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని వ్యవసాయశాఖ అధికారులు, కలెక్టర్లను ఆదేశించారు.

**నీట్‌పీజీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు:**

ఈ నెల 30న నిర్వహించనున్న నీట్ పీజీ ప్రవేశ పరీక్ష సజావుగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు జిల్లాల్లో చేపడుతున్న ఏర్పాట్లను సీఎస్ సమీక్షించారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు, భద్రత, విద్యుత్ సరఫరా, తాగునీరు, రవాణా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 30 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు, నిరంతర విద్యుత్ సరఫరా, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.



**పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన చర్యలు:**

తెలంగాణ టూరిజం 2047 పాలసీలో భాగంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసి దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని సీఎస్ సూచించారు. ప్రతి జిల్లాలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను గుర్తించి అక్కడ మౌలిక సదుపాయాలు, రహదారి కనెక్టివిటీ, పరిశుభ్రత, పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచాలని కలెక్టర్లకు సూచించారు. జిల్లాల ప్రత్యేకతలు, చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి 27 స్పెషల్ టూరిజం ఏరియాలను గుర్తించినట్లు సీఎస్ తెలిపారు. ఆయా ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసి పర్యాటక రంగాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కలెక్టర్లు కృషి చేయాలని సూచించారు. తెలంగాణ బ్రాండ్‌ను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తరించేందుకు టూరిజం 2047 ప్రణాళికలు దోహదపడతాయని పేర్కొన్నారు. స్పిరిచువల్, హెరిటేజ్, ఎకో టూరిజం, క్రాఫ్ట్ టూరిజం అభివృద్ధికి తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబ్‌నగర్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీఆర్ఓ ఏ. నిర్మల, జిల్లా పర్యాటక అధికారి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పండుగ.. ఏఐసీఎస్ క్రీడా ఎంపికలకు షెడ్యూల్ విడుదల

- సెప్టెంబర్ 3న జిల్లా స్థాయి ఎంపికలు.. 8, 9 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు

- ఏఐసీఎస్ క్రీడా పోటీలకు ప్రభుత్వ ఉద్యోగులు సిద్ధం కావాలి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 25 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ 202627లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనేందుకు జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడా ఎంపికలకు షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు మహబూబ్‌నగర్ జిల్లా యువజన, క్రీడల అధికారి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో వివిధ క్రీడల్లో ప్రతిభ కలిగిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నుంచి జిల్లా స్థాయి జట్ల ఎంపికలు సెప్టెంబర్ 3, 2026న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి ఎంపికలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి క్రీడా ఎంపికలు సెప్టెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎల్‌బీ స్టేడియం, జింఖానా గ్రౌండ్స్‌లో వివిధ క్రీడలకు అనుగుణంగా ఎంపికలు, పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఏఐసీఎస్ క్రీడా పోటీల్లో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, కబడ్డీ, ఫుట్‌బాల్, హాకీ, ఖోఖో, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, టెన్నిస్, యోగా తదితర క్రీడలకు సంబంధించి పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఎంపికలకు హాజరయ్యే ప్రభుత్వ ఉద్యోగులు సంబంధిత క్రీడా విభాగానికి సంబంధించిన వివరాలు, అర్హతలు, అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత తేదీలో హాజరు కావాలని సూచించారు. జిల్లాలో ప్రతిభావంతులైన ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసేందుకు ఈ క్రీడా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో తమ ప్రతిభను చాటుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి రాజశేఖర్‌రెడ్డి కోరారు.

